# ఆర్‌డిటి

## ఎకాలజీ సెంటర్, అనంతపురం.

**ఈ మాసపు సమాచారం** **జనవరి 2005**

**FOR PRIVATE CIRCULATION ONLY**

## 2005 నూతన సంవత్సర శుభాకాంక్షలు

వాటర్‌షెడ్ గ్రామాల ప్రజలకు, కమిటీ సభ్యులకు, రైతులకు, ప్రభుత్వ అధికారులకు మరియు ఆర్.డి.టి. సిబ్బందికి నూతన సంవత్సర శుభాకాంక్షలు.

రసాయనిక ఎరువుల, మందులరహిత వ్యవసాయాభివృద్ధికి, సహజనీటి వనరుల సంరక్షణకు పునరంకితమవుదామని ప్రతినబూనుతూ మనమందరం కొత్త సంవత్సరాన్ని స్వాగతిద్దాం

మీ

**మల్లారెడ్డి** మరియు యితర సిబ్బంది

## మీరు గమనించారా !

రసాయనిక పురుగుమందుల వాడకంలో మన రాష్ట్రానిదే అగ్రస్థానం. జాతీయ స్థాయిలో 20 వేల కోట్ల రూపాయల వ్యాపారం జరుగుతున్నది. ఏటా 2 లక్షల మంది పురుగుమందులతో చనిపోతున్నారు. ఏటా 68 వేల మంది రైతులు పొలాలకు మందు చల్లుతూ, ఆ విష ప్రభావాలకు గురై అనేకానేక ఆరోగ్యసమస్యలు ఎదుర్కొంటున్నారు. మార్కెట్‌లో లభించే పురుగుమందులలో దాదాపు సగం పర్యావరణం, ప్రజలు, పశువులు, పక్షులపై దుష్ప్రభావాన్ని చూపేవే. దేశవ్యాప్తంగా 90 వేల మెట్రిక్ టన్నుల క్రిమి సంహారక మందుల ఉత్పత్తి జరుగుతూ ఉంది. ఇది ప్రతి ఏటా 2 నుంచి 5 శాతం వరకూ వృద్ధి చెందుతూ ఉంది. రైతులు వాడేవాటిలో 10 శాతం నిషేధించదగిన సింథటిక్ పెరిత్రాయిడ్స్ మందులు వాడుతున్నారు. దీనికి కారణంగా పండించిన పంటలు, కూరగాయలు, పాలు లాంటి వాటిలో విష అవశేషాలు చేరుకుని మనుష్యుల శరీరాలపై దుష్ప్రభావాన్ని చూపుతున్నాయి. చిన్న వయస్సులోనే మధుమేహం, రక్తపోటు (బి.పి.), జ్ఞాపకశక్తిలోపం లాంటివి పెరుగుతున్నాయి.

(వార్త - నవంబరు 22, 2004 సౌజన్యంతో)

ఈ భూగోళంమీద చిట్ట చివరి చెట్టు నరికినప్పుడు,
ఈ భూగోళంమీద చిట్ట చివరి చేప పట్టినప్పుడు,
ఈ భూగోళంమీద చిట్ట చివరి నది విషతుల్యమైనపుడు
అప్పుడు ;
డబ్బు కడుపు నింపలేదనే వాస్తవం తెలుసుకుంటావు -

ఆమెన్.

అమెరికాలో స్థానిక తెగల ఒక సామెత !

**చిట్కా :** చెవి పోటుకు పారిజాతం ఆకులు లేదా పువ్వుల రసాన్ని చెవిలో వేస్తే చెవిపోటు తగ్గుతుంది. నేతితో కర్పూరం కలిపి వేడిచేసి, ఆ నేతిని ఐదారు చుక్కలు చెవిలోవేసినా ఉపశమనం కలుగుతుంది.

## అనంత కరువు అంతం కావాలంటే...

### 1. పరిచయం

అనంతపురం జిల్లాలో నిరంతర కరువు, నిత్య దారిద్ర్యం విలయతాండవం చేస్తున్నాయి. కేవలం వర్షాధార వ్యవసాయంపైననే ఆధారపడి దాదాపు 30 లక్షల మంది రైతులు, రైతు కూలీలు జీవచ్ఛవాలుగా గ్రామాలలో బ్రతుకుతున్నారు. జిల్లాలో ఏ ఇతర పరిశ్రమలు గానీ, ఉద్యోగావకాశాలుగానీ లేవు. కొంతమాత్రంగా వున్న చేనేత రంగం కూడా సంక్షోభంలోనే కొట్టుమిట్టాడుతున్నది. మూతపడిన గుంతకల్లు స్పిన్నింగ్‌మిల్లు, ఏ.పి. లైటింగ్‌లు తెరుచుకొనే అవకాశాలు కనపడడంలేదు. జిల్లాలో వ్యాపార వాణిజ్యాల ఆర్థిక వ్యవస్థ కూడా, వర్షాధార కరువు వ్యవసాయంపైననే ఆధారపడి పట్టణాలు ఆర్థిక సంక్షోభంలో వున్నాయి. రైతుల ఆత్మహత్యలు ఆగడంలేదు. రైతులేకాదు, చేనేత, వ్యాపార వాణిజ్య రంగాలలో కూడా చాలామంది దివాళాతీసి, ఆత్మహత్యలకు చేరువలో ఉన్నారు.

ఇటువంటి పరిస్థితులలో మన జిల్లా కరువు - దారిద్ర్యమనే కవల సమస్యలనుండి బయటపడాలంటే క్రింది కార్యక్రమాలు తప్పనిసరిగా, ఒక నిర్ధిష్ఠ కాలవ్యవధిగల ప్రణాళిక రూపంలో, నిధుల కొరత లేకుండా యుద్ధప్రాతిపదికన చేపట్టవలసియున్నది.

### 2. అనంతపురం జిల్లాకు ఒక నూతన భూవినియోగ విధానము (New Land Use Plan)

ప్రస్తుతం మన జిల్లాలో వున్న భూవినియోగం ఇటు పర్యావరణానికి, అటు ప్రజలకు అనర్ధదాయకంగా వున్నది. మన జిల్లాలో మొత్తం భూమి విస్తీర్ణం దాదాపు 20 లక్షల హెక్టార్లు. అందులో 2 లక్షల హెక్టార్లు దాదాపు వృక్షసంపదలేని రిజర్వుడు ఫారెస్ట్, 4 లక్షల హెక్టార్లు బోడిగుట్టలు, 10 లక్షల హెక్టార్లు వ్యవసాయ భూమి. వ్యవసాయ భూమిలో దాదాపు ఒక లక్ష హెక్టార్లు నీటి సాగు. 9 లక్షల హెక్టార్లు వర్షాధార వ్యవసాయం. వర్షాధార వ్యవసాయంలో 8 లక్షల హెక్టార్లు వేరుశెనగ, మిగిలిన ఒక లక్ష హెక్టార్లలో జొన్న, కుసుమ, ధనియాలు, శెనగ మొదలగు పంటలు. ఈ భూ వినియోగంలో సమగ్ర మార్పు అవసరం. కనీసం 4 లక్షల హెక్టార్లు నీటిసాగు, 3 లక్షల హెక్టార్లు పండ్లతోటలు మరియు ఇతర వృక్ష పంటలు, 4 లక్షల హెక్టార్లు కొండ గుట్టలు, బీడు భూములలో వివిధ గడ్డి, వృక్ష పంటలు మరియు 2 లక్షల హెక్టార్లు అడవి ప్రాంతంలో వివిధరకాలైన వృక్ష పంటలు ఉండేవిధంగా భూవినియోగంలో మార్పు తీసుకొని రావలయును.

#### 2.1.1 కనీసం 40 శాతం వ్యవసాయ భూమికి సాగునీటి వసతి కల్పించడం

మన జిల్లాలో దాదాపు 10 లక్షల హెక్టార్ల వ్యవసాయ భూమి వున్నది. అందులో కేవలం 1 లక్ష హెక్టార్లు మాత్రమే (10 శాతం) బోరుబావులు, మరియు తుంగభద్ర ప్రాజెక్టు ద్వారా నీటిపారుదల క్రింద యున్నది. కనీసం నదీజలాల ద్వారా కనీసం 40 శాతానికి →

"భూమాత అపారమైన తన అడవుల్ని, వన్య ప్రాణుల్ని, నదుల్ని, సముద్రాల్ని కాపాడుకుంటున్నంత వరకూ మానవ సంతతి వర్ధిల్లుతూనే ఉంటుంది" – ఉపనిషత్తులు

సాగునీటి సదుపాయాన్ని పెంచవలసియున్నది. అంటే కనీసం 4 లక్షల హెక్టార్లకు నమ్మదగిన నదీజలాల ద్వారా సాగునీటి వసతి కల్పించవలయును. అటువంటి నదీజలాలను ముఖ్యంగా మన జిల్లాలోని చెరువులను నింపుట ద్వారా అనుసంధానము చేసి, ఒక "నీటి వలయం" (Water Grid) గా నిర్మించవలయును. అప్పుడే అనంతపురం జిల్లాలోని వ్యవసాయంలో కొంతవరకైనా నిలకడ ఏర్పడుతుంది.

### 2.1.2 తాగునీటి సౌకర్యము :

దినదినానికి తీవ్రమవుతున్న తాగునీటి కొరతను తీర్చడానికి మరియు ఫ్లోరైడ్ సమస్యను అధిగమించడానికి అవసరమైనంత తాగునీటిని జిల్లా వ్యాప్తంగా నదీజలాల ద్వారా అందించవలయును.

### 2.2 మూడు లక్షల హెక్టార్లలో పండ్లతోటలు పెంచడం :

మనకున్న వ్యవసాయ భూమిలో కనీసం 30 శాతం అంటే 3 లక్షల హెక్టార్లలో పండ్ల తోటలు ప్రోత్సహించి, పెంచవలయును. మన జిల్లాకు అనువైన పండ్లతోటలు మామిడి, చింత, చీని, దానిమ్మ, సపోట, నిమ్మ, రేగు మొ॥నవి వర్షాధార మరియు తక్కువ నీటితో పండించగల పండ్లతోటలకు, ఔషధ మొక్కలకు, మేతచెట్లకు ప్రాధాన్యమివ్వవలయును. వాటిని పెంచి పోషించుటకు రైతులకు 5 సం॥లపాటు ఆర్థిక సహాయం అందించవలయును.

### 2.3 సూక్ష్మనీటి సాగు (Drip Irrigation)

పండ్లతోటలకన్నింటికీ "డ్రిప్ ఇరిగేషన్" తప్పనిసరిగా చేసి, అందుకు 90 శాతం సబ్సిడి యివ్వవలెను.

### 2.4 పాడి పరిశ్రమ మరియు పశువుల పెంపకంతో 3 లక్షల కుటుంబాలకు అదనపు జీవనోపాధి :

మన జిల్లాలో దాదాపు 5 లక్షల కుటుంబాలు రైతులు మరియు రైతు కూలీలు ఉన్నారు. వారిలో కనీసం 3 లక్షల కుటుంబాలకు, ముఖ్యంగా రైతు కూలీలకు, చిన్న, సన్నకారు రైతులకు పాడి పరిశ్రమను మరియు గొర్రెలు, మేకల పెంపకమును ప్రోత్సహించవలెను. మేత సమస్యను తీర్చుటకు బీడుగా వున్న చౌడు భూములను, కొండగుట్టలను పశువుల పెంపకందారులకు పట్టాలు యిచ్చి, వాటిలో మేతను మరియు ఇతర ప్రయోజనకరమైన చెట్లను అభివృద్ధిపరచడానికి, కనీసం 5 సం॥లపాటు ఉపాధి హామీలాంటి పథకాల ద్వారా సహాయం అందించవలెను. అనువైన చోట్ల నీటి సదుపాయం సామూహిక బావుల ద్వారా కల్పించవలెను. పశువులను విచ్చలవిడిగా మేపే పద్ధతికి స్వస్తిచెప్పి, ఇంటి దగ్గరే కోసుకొనివచ్చిన గడ్డితోనూ మరియు ఫీడ్ మిక్స్ (Feed Mix) తోనూ మేపే పద్ధతిని ప్రోత్సహించవలెను.

### 2.5 ఉపాధి హామి పథకం ద్వారా పాడి, పశువుల పెంపకంతోపాటు, బీడు భూములను, కొండ గుట్టలను, అడవులను ఉత్పాదక వనరులుగా మార్చుట :

గ్రామీణ ఉపాధి హామీ చట్టమును అమలుపరిచి కనీసం సంవత్సరంలో 100 రోజులు పని అడిగిన కూలీలందరికీ పని కల్పించవలెను. ఈ కార్యక్రమాన్ని (2.2 మరియు 2.4 పేరాలలో వివరించినట్లుగా) వర్షాధార చిన్న, సన్నకారు రైతులు, పండ్లతోటలు పెంచుటకు బీడుభూములను, గుట్టలను గడ్డి మొక్కలతోనూ, గడ్డికి పనికొచ్చే చెట్టు (అవిశె, సూబాబుల్, తుమ్మ, వేప మొ॥వి) పెంపకమునకు ఉపయోగించవలెను. వర్షాధార పండ్లమొక్కలైన సీతాఫలం, రేగు, చింత మరియు ఇతర ప్రజోపయోగమైన ఔషధమొక్కలు, ఇంధనమొక్కలు, నార, కలప మొదలగు మొక్కలను పెంచవలెను. వాటిపై హక్కును ఆ పనిచేసిన కూలీలకే భవిష్యత్తులో చెందునట్లు హక్కు కల్పిస్తూ వారికి అదనంగా పశువులు, గొర్రెలు, మేకలు కొనుటకు ఋణసౌకర్యం కల్గించవలెను. తద్వారా బీదవారి జీవనోపాధికి తోడ్పడవలెను.

ఉపాధి హామి పథకాన్ని మన జిల్లాలోని అటవీ సంపదను పునరుద్ధరించుటకు ప్రజల భాగస్వామ్యము కల్పించి, ఫలసాయపు హక్కులతో ప్రోత్సహించవలెను.

### 2.6 పంటల బీమా పథకాన్ని అన్ని పంటలకు, అందరు రైతులకు వర్తింపజేయుట :

మన జిల్లాలో పండించే ప్రతి పంటకు పంటల బీమా పథకాన్ని సాధారణ పంట దిగుబడి ప్రాతిపదికన అమలుచేయవలెను. బ్యాంకు అప్పులతో సంబంధంలేకుండా ప్రతి రైతుకు ఈ సదుపాయం కల్పించవలెను.

### 2.7 ప్రతి రైతుకు ఋణ సదుపాయం కల్పించుట :

ప్రతి రైతుకు పంట పెట్టుటకు బ్యాంకు అప్పు సదుపాయమును కల్పించవలెను. అప్పులు తగినంత మొత్తంలో, సకాలంలో రైతుకు అందుబాటుచేసి వడ్డీ వ్యాపారులనుండి, దళారుల నుండి రక్షించవలెను.

### 2.8 ప్రతి పంటకు కనీస మద్దతు ధర గిట్టుబాటుగా ఉండేటట్లు ప్రకటించడం :

ప్రతి పంటకు కనీస మద్దతు ధర ప్రకటించి, మార్కెట్‌లో అంతకు తక్కువ ధర వున్నప్పుడు ప్రభుత్వం ఆహార ఉత్పత్తులను కొనుటకు తగిన ఏర్పాట్లు చేయవలెను. కనీస మద్దతు ధర రైతుకు గిట్టుబాటు అయ్యేంతగా నిర్ణయించవలెను. దళారుల దోపిడీకి గురికాకుండా రైతుకు తగిన మౌలిక సదుపాయాలు కల్పించవలెను.

### 2.9 రైతుల యాజమాన్యంలో, పరస్పర సహకార చట్ట పరిధిలో వ్యవసాయ పరిశ్రమలు మరియు వ్యవసాయ మౌలిక సదుపాయాలు :

వ్యవసాయ మార్కెట్‌లను ఆధునీకరించడంతోపాటు, వాటిలో కోల్డ్ స్టోరేజ్ (Cold Storage) లను స్థాపించవలెను. పరస్పర సహకార రంగంలో (Mutually Aided Co-operative Societies / MACs) రైతులకు భాగస్వామ్యం ఉండే విధానంలో వ్యవసాయ పరిశ్రమలు స్థాపించాలి. వేరుశనగ ద్వారా వివిధ తిండి ఉత్పత్తులను, జొన్నలు, సజ్జలు, నువ్వులు, పెసలు, ధనియాలు, కందులు మొదలగు కాయధాన్యములకు, చిరుధాన్యములకు విలువను జోడించడంతోపాటు, వాటి ద్వారా నిల్వయుంచగల వివిధ తిండి పదార్థాలను తయారుచేయు పరిశ్రమలను స్థాపించవలెను. చీనీ, నిమ్మ మామిడి, జామ, సపోట మొదలగునవి పండ్ల రసములు (Fruit Juices), జామ్‌లు (Jams) నిల్వయుంచగల వివిధ పండ్ల ఉత్పత్తులను, కూరగాయల ఉత్పత్తులను తయారుచేయు పరిశ్రమలను స్థాపిపంచవలెను. పాడి పరిశ్రమను పాల ఉత్పత్తులతో సంధానంచేసి, పాలపొడి, చాక్‌లెట్లు, నెయ్యి, వెన్న (Butter & Cheese) మొదలగు పాల ఉత్పత్తులను తయారుచేయవలెను."అమూల్" (AMUL - Anand Milk Union Ltd.) తరహాలో పాడి పరిశ్రమను మరియు పాల ఉత్పత్తులను ప్రోత్సహించి, పాల ఉత్పత్తులలో వచ్చే ఆదాయంలో కూడా రైతుకు భాగస్వామ్యం కల్పించవలెను. తద్వారా, రైతుకు గిట్టుబాటు ధరతోపాటు, జిల్లాలోని విద్యావంతులకు ఉపాధి కూడా లభించును.

### 3. ముగింపు :

పై కార్యక్రమాలన్నీ ఒక నిర్దిష్ట కాలవ్యవధిగల ప్రణాళికతో, తగిన నిధులను సమకూర్చి, ప్రజల భాగస్వామ్యంతో చేపట్టవలెను. ఈ కార్యక్రమాలు యుద్ధ ప్రాతిపదికన, పార్టీ రాజకీయాలకు, వర్గాలకతీతంగా అమలుచేయుటకు అన్ని రాజకీయపక్షాలు సహకరించవలెను. ప్రతి స్థాయిలోనూ ప్రజలు మరియు పౌరసంఘాల నిఘాను ఏర్పరచి, పారదర్శకతతో అమలుచేయవలెను. అమలు చేసే యంత్రాంగాన్నీ, ప్రజలను సరైన మార్గంలో నడిపించుటకు అన్ని రాజకీయ పక్షాలు కలిసి కృషి చేయవలెను. అప్పుడే, అనంతపురం జిల్లాలోని ప్రజలలో నెలకొన్నివున్న నిరాశానిస్పృహలను తొలగించి, భవిష్యత్తుపై ఆశలను చిగురింప చేయవచ్చును.

మీ విశ్వసనీయుడు,

**వై. వి. మల్లారెడ్డి**

డైరెక్టరు - ఎకాలజి
ఆర్.డి.టి. ఎకాలజీ సెంటర్

# వాటర్‌షెడ్ గ్రామాల వార్తలు

## అమ్మవారిగుట్టలో చింతచెట్ల పెంపకం :

వెలిగొండ గ్రామంలో గుట్టలో చెట్ల పెంపకముపై గ్రామంలో వున్న వివిధ కమిటీల్లో, పశువులు, గొర్రెలు, మేకలు వున్న కుటుంబాలవారితో గ్రామ పెద్దలు వారం రోజులు చర్చలు జరిపి గ్రామ సభలో (01-09-04) ఆ గుట్టలోనికి పశువులు, గొర్రెలు, మేకలు విడవకూడదని గ్రామ సభలో అందరిచేత నిర్ణయము చేసి ఆమోదము తీసుకున్నారు మరియు గ్రామములో ఆగష్టు 15 నాడు, గ్రామ సభరోజు, రిపబ్లిక్ రోజు కనీసం ఈ మూడు రోజులు మద్యం సేవించరాదని గ్రామ సభలో నిర్ణయము తీసుకోవడము జరిగినది.

## మట్టి పని :

వెలిగొండ వాటర్‌షెడ్‌లో భూసార సంరక్షణ పనులు జరుగుతున్నప్పుడు బి. సుంకున్న అనే కూలీ గ్రామ పెద్దల సమక్షములో 20-05-2004 నాడు ఉదయము 4 గంటల నుండి మధ్యాహ్నము 3 గంటల వరకు ఎవరి సహాయము లేకుండా ఒక్కడే 1 మీ. వెడల్పు, 1 మీ. లోతు, 22.50 మీ. పొడవుతో పనిచేసి ఆ గ్రామములో రికార్డు సృష్టించినాడు. అతనికి కమిటీవారు పూల హారంతో సన్మానించి, రూ. 116/- బహుకరించి గ్రామములో ఊరేగింపు చేయడం జరిగినది.

## కూరగాయలు :

వెలిగొండ వాటర్‌షెడ్‌లో సంస్థ ఇచ్చిన కూరగాయల విత్తనాలు రైతు బి. సంజన్న, యం. శ్రీనివాసులు, పి. రామాంజినేయులు మొదలగు రైతులు తమ గట్లపై వేసుకొని తాజా కూరగాయలను పండిస్తూ భవిష్యత్తులో విత్తనానికి వదులుకొని, విత్తనాలను కూడా చేసుకొని రాబోవు సంవత్సరానికి ఎవరిని అడగకుండా, వారే విత్తనాన్ని సేకరించి వేసుకునేటట్లు, యితరులకు ఆదర్శులైనారు.

కరిగానిపల్లిలో నా పొలము ప్రక్కన ప్రభుత్వం తరుపున ఒక చెక్‌డ్యాము నిర్మించడము జరిగినది. దీనికి కావలసిన నీరు మందాలపల్లి కొండమీద, కొత్తపల్లి వంక ద్వారా చెక్‌డ్యాం ద్వారా నిండుతున్నది.

ఈ చెక్‌డ్యాం నిండినప్పుడి నుండి క్రింది బావులో నీటి మట్టం పెరిగినది. బోరు బావులలో నీరు కూడా పెరిగినది. ఈ విధముగా 6 బావులలో నీరు పెరిగినందున పంటలు పండించుటకు అవకాశము పెరిగినది.

ఈ ప్రాంతములో పశువులు నీరు త్రాగడానికి, పండ్ల చెట్లకు నీరు అందించుటకు అందుబాటులో ఉన్నది.

రంగమ్మ - కరిగానిపల్లి

## ఈ మాసపు సూక్తి :

ఖలులగువారినెల్ల నధికార సమర్థులఁజేసి, తానిర
ర్గళగతియై నికృష్టనిజకర్మము విస్మృతి పాలొనర్చి, ని
శ్చలగుణవైరియై, విధివశంబున సంపద గాంచి త్రుళ్ళుచున్
మేలఁగు నృపాలు దేశమున మేలు లభించునె యెట్టివారికిన్ ?

– భర్తృహరి –

**తాత్పర్యము :** నీచకార్యాలు చేసే దుర్గుణులు వాళ్ళుచేసే పనులకు అనుకూలమైన వాళ్లనే చుట్టూ చేర్చుకుంటారు. అలాంటివారికి తమగతం గుర్తుకురాదు. తాము చేసే పనిలోని నీచత్వం వారికి గుర్తుకురాదు. వారి మాదిరి కాకుండా సాధుజీవనం సాగించేవారు వారి దృష్టిలో అల్పులు, అసమర్థులు. కాబట్టి ఆ నీచ మానవుల దగ్గరకు వెళ్ళకుండా, వారి కళ్ళబడకుండా జీవించడం శ్రేయస్కరం అంటాడు భర్తృహరి.

**చర్చ :** ధనదాహంతో అక్రమమార్గాలలో డబ్బు సంపాదించే పద్ధతులను ఎన్నుకొన్నవాడు సమాజం మెచ్చని నీచకార్యాలకు పాల్పడుతూ ఉంటాడు. ఇటువంటి వారిని భర్తృహరి ఖలులతో పోలుస్తున్నాడు. ఖలులు అంటే దుర్గుణులు, నిలువెల్ల విషం ఉన్నవారని అర్థం. డబ్బు సంపాదించడం కొరకు, ఆ డబ్బుద్వారా తాము పొందాలనుకునే సుఖసౌఖ్యాలకోసం వీరు ఎంతటికైనా తెగిస్తారు. తాము చేసే పనులకు మద్దతు కూడగట్టుకునే ప్రయత్నం కూడా చేస్తారు. ఇతరులకు ప్రలోభాలు చూపి వారిని తమ చుట్టూ చేర్చుకుంటారు. వారు చేసే నీచ కార్యాలు సరైనవేనని దబాయిస్తారు. ఇంతటితోనే ఊరుకోరు. సన్మార్గంగా, విలువలతో బ్రతుకుతున్నవారిపై రాళ్ళువిసిరే ప్రయత్నం చేస్తారు. వారిని అసమర్థులుగా, బ్రతకడం చేతకాని వారుగా చిత్రీకరిస్తారు. కాబట్టి ఇటువంటి ఖలులకు (దుష్టులకు) దూరంగా, వారి కంటపడకుండా బ్రతకమంటాడు భర్తృహరి.

భర్తృహరి కాలంలో సమాజం ఇప్పుడున్నంత అభివృద్ధి చెందలేదు. ప్రజాస్వామ్య వ్యవస్థలేదు. కాబట్టి, ఇలాంటి దుర్గుణాలు కల్గినవారు కొద్దిమంది వ్యక్తులుగానే ఉండేవారు. సమాజం వీరిని నేరస్థులుగానే చూసేది. ఐతే ఇప్పుడు పరిస్థితులలో ఎంతో మార్పు వచ్చింది. ఈ మార్పులో భర్తృహరి చెప్పిన దుర్గుణులు కూడా చాలా అభివృద్ధి చెంది వారుచేసే నీచకార్యాలకు అనుగుణంగా రాజకీయాల్ని ఒక ముసుగుగా వాడుతున్నట్లు మనం గమనిస్తున్నాము. ఏదో ఒక రాజకీయపార్టీలో వుంటూ గూండాలను, సంఘవిద్రోహ శక్తులను చేరదీసి, ప్రభుత్వ పథకాల్ని, కాంట్రాక్టులను దౌర్జన్యంగా ఆక్రమిస్తూ కోట్లకు పడగలెత్తుతున్నారు. ఒకప్పుడు సైకిల్ కూడా లేనివారు నేడు అధునాతనమైన టాటా సుమో, క్వాలీస్‌లాంటి వాహనాలు సమకూర్చుకున్నారు. ఒక విలేఖరి తన వ్యాసంలో మన జిల్లాలో వరుస కరువులతో ప్రజలు అల్లాడుతూ, వలసలు పోతూవుంటే, జిల్లా రోడ్లలో లెక్కకులేకుండా అధునాతన వాహనాలు తిరుగుతున్నాయని పేర్కొన్నాడు. ఇవన్నీ ప్రజలకు చెందాల్సిన ప్రజాధనం దారిమళ్ళిన ఫలితమేనని ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. ఇటువంటి వారివద్దకు వెళ్ళకుండా, వారిని మనం సామాజిక నేరస్థులుగా పరిగణించాలి.

వై.వి. మల్లారెడ్డి

# ఈ మాసంలో వ్యవసాయం

## రసాయనిక పురుగు మందులు వాడకుండా పంటలు పండించవచ్చు :

ఖమ్మం జిల్లా పాల్వంచ మండలములోని పునుకుల గ్రామ రైతులు, ఇతర రైతాంగానికి స్ఫూర్తినిచ్చే కార్యక్రమాల్ని చేపట్టడం విశేషం. పంటలకు హాని చేస్తున్న రసాయన పురుగు మందుల్ని పునుకుల గ్రామ రైతులు వారి పొలాల్లో వినియోగించడంలేదని ఆ గ్రామాధికారులు అధికారికంగా 2003 సంవత్సరంలో ప్రకటించినారు. పునుకుల గ్రామ రైతులు చీడపీడలు అధికంగా సోకే ప్రత్తి, మిరప, శెనగ, వరి లాంటి పంటలకు కూడా రసాయన పురుగుమందుల్ని వినియోగించడంలేదు. అంతకుముందు మాత్రం పై పంటలకు ఆ గ్రామ రైతులు విస్తారంగా, విచక్షణారహితంగా పురుగు మందుల్ని వినియోగించేవారన్నది గమనార్హం.

ఇది నిజమా ! కాదా ! అన్నది ప్రత్యేకంగా తెలుసుకొనుటకు, ఆర్.డి.టి/యాక్షన్ ఫ్రటర్నా నుండి 11 మంది సిబ్బంది నవంబరు నెల 29వ తేది బయలుదేరి 30వ తేది పునుకుల గ్రామ రైతులతో కలిసి వారి అనుభవాల గురించి చర్చించి, పంట పొలాలను సందర్శించి రసాయనిక మందులు వాడకుండా పంటలు పండించవచ్చునని తెలుసుకున్నారు. ఈ గ్రామ రైతులు కేవలం జీవకీటక నాశనులతో పురుగు మందుల్ని తయారు చేసుకొని వాడుచున్నారు.

ఆర్.డి.టి./యాక్షన్ ఫ్రటర్నా సిబ్బంది చూసి తెలుసుకొన్న విషయాలతోపాటు కవితా కూరగంటివారు పునుకుల విశేషం గురించి 2004 డిశెంబరు నెల అన్నదాత మాస పత్రికలో విపులంగా రచించిన వ్యాసములో పొందుపరచియున్నారు. అన్నదాత వారి సౌజన్యముతో దీన్ని యధాతధంగా :

**పెరిగిన వ్యయం :** గత ఐదేళ్ళలో మన రాష్ట్రం తరుచుగా దుర్భిక్షం ఎదుర్కొంటోంది. వేలాదిమంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఈ ఏడాది జూన్-అక్టోబర్ మద్యకాలంలో రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఆత్మహత్యలకు ఒక కారణం పెరుగుతున్న రుణభారం. చాలామంది రైతులు ముందూ వెనకా ఆలోచించకుండా అప్పుచేసి ఖరీదైన విత్తనాలు, పురుగుమందుల్ని కొంటున్నారు. దుర్భిక్షం, అతివృష్టి తదితర కారణాలవల్ల పంట చేతికి రాకపోతే రుణం తీర్చలేక, జీవనోపాధి లభించక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

(తరువాయి భాగం 4వ పేజీలో)

(3వ పేజి తరువాయి భాగం)

## రసాయనిక పురుగు మందులు వాడకుండా పంటలు పండించవచ్చు...

ఈ నేపథ్యంలో పునుకుల గ్రామరైతులు ఖరీదైన పురుగు మందుల వినియోగానికి స్వస్తి చెప్పారు. సేద్యానికి అవుతున్న అనవసర వ్యయాన్ని వారు తగ్గించుకుని ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితులు తలెత్తకుండా జాగ్రత్తపడటం ముదావహం. ఈ గ్రామ రైతుల్లో నిరక్షరాస్యులైన గిరిజనులు అధికంగా ఉన్నా విద్యావంతులైన కర్షకులకు ఆదర్శంగా నిలిచే పనులు చేపట్టారు.

**రూ. 30 లక్షలు ఆదా ! :** పర్యావరణ పరిరక్షణకు అనుకూలమైన పద్ధతుల్లో చీడపీడలను నివారించుకుంటున్నందువలన సేద్యానికి అవుతున్న వ్యయంలో ఏటా దాదాపు రూ. 30 లక్షల వరకు పొదుపు చేయగలుగుతున్నామని ఇటీవల పునుకుల గ్రామ రైతులు సగర్వంగా ప్రకటించారు. ఆ పల్లెలో మొత్తం దాదాపు 600 ఎకరాల సేద్యపు భూమి ఉంది. ఖరీదైన రసాయన పురుగుమందులు కొనవలసని అవసరంలేదు కనుక ఎకరానికి ఐదువేల రూపాయల్ని పునుకుల గ్రామ రైతులు ఆదాచేస్తున్నారు.

**పురుగుమందులు లేకుండా పత్తి సాగు :** పత్తి పొలాల్లో రసాయన పురుగుమందుల వినియోగానికి విజయవంతంగా స్వస్తిచెప్పడం మాత్రం నిజంగా చాలా గొప్ప విషయం. పునుకుల గ్రామంలో 15 ఏళ్ళ క్రితం పత్తిసాగులేదు. 1988-89లో ఆ పల్లెకు గుంటూరు ప్రాంత రైతులు వలస వచ్చారు. పత్తిని ఆ గ్రామానికి వీరే పరిచయం చేశారు. గుంటూరు నుంచి వచ్చిన రైతులు పత్తిసాగును విస్తారంగా చేపట్టారు. వీరు పత్తి పంటలకు తరచుగా రసాయన పురుగుమందుల్ని చల్లడం పునుకుల రైతులు గమనించారు. తమ పొలాల్లో కూడా చీడపీడల నివారణకు పునుకుల రైతులు ఖరీదైన పురుగుమందుల్ని వాడటం ప్రారంభించారు. తొలిరోజుల్లో పురుగుమందులు సమర్ధవంతంగానే పనిచేశాయి. దాంతో క్రిమి సంహారకమందులు అమ్మే దుకాణాలు పునుకుల సమీపంలో వున్న పాల్వంచ పట్టణంలో తామర తంపరగా పుట్టుకువచ్చాయి. తాజా పురుగుమందుల్ని దుకాణదారులు స్థానిక రైతులకు రుణ ప్రాతిపదికన విక్రయించడం పెరిగింది. ఇలా కొన్నేళ్ళు గడిచింది.

**దుష్ఫలితాలు :** ఆ తర్వాత పత్తిపై పురుగుమందుల్ని వాడినా చీడపీడలు తగ్గడం లేదని రైతులు అనుభవపూర్వకంగా గ్రహించి ఖిన్నులైనారు. మోనోక్రోటోఫాస్, మెథైల్ పారాథియాన్, క్లోరోఫైరిఫాస్, ఎండోసల్ఫాన్, సింథటిక్ పైరిథ్రాయిడ్స్ వంటి అనేకరకాల పురుగుమందుల్ని వాడినా ఫలితం కనిపించలేదు. చీడపీడలు తాత్కాలికంగా తగ్గినా ఆ వెనువెంటనే అవి అత్యధికంగా పెరగడాన్ని రైతులు గమనించి ఆశ్చర్యపోయారు. వాటిని నిర్మూలించడానికి అధిక మోతాదులో పురుగుమందుల్ని వాడవలసి వచ్చేది. అంటే క్రిమి సంహారకమందుల కోసం రైతులు వెచ్చిస్తున్న వ్యయం తడిసి మోపెడయ్యేదన్నమాట.

**అనారోగ్యం :** పురుగుమందుల విక్రేతలు విత్తనాలు, ఎరువులు, రసాయన పురుగుమందులను సరఫరా చేయడంతోపాటు సన్నకారు రైతులకు అధిక వడ్డీకి రుణాలను కూడా ఇచ్చేవారు. చీడపీడల కారణంగా దిగుబడులు తగ్గి రుణభారం పెరగడంతో పునుకులకు చెందిన కొందరు రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. రసాయన పురుగుమందుల్ని ఎక్కువగా వాడటంవలన రైతులు ఆరోగ్య సంబంధిత సమస్యలు కూడా ఎదుర్కోవాల్సి వచ్చింది.

పురుగుమందుల్లో ఉండే విషప్రభావంతో అనారోగ్యం పాలైన ఓ బక్క రైతు చికిత్స కోసం 1999 సం॥లో రూ. 1800/- ఖర్చు చేయవలసి వచ్చింది. పురుగుమందుల్ని ఎక్కువగా మహిళలే పంటలపైన చల్లేవారు.

చర్మవ్యాధులు రావడం, చూపు మందగించడం, శరీరానికి నొప్పులు పెరగడంవంటి సమస్యల్ని స్త్రీలు ఎదుర్కొన్నారు.

**స్వచ్ఛంద సంస్థల సహాయం :** పునుకుల గ్రామ రైతులు రసాయన పురుగుమందులు వినియోగించి సమస్యలు కొనితెచ్చుకుంటున్న వైనాన్ని స్థానికంగా పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థ గమనించింది. రసాయన పురుగుమందులకు బదులుగా పర్యావరణ పరిరక్షణ పద్ధతుల్లో చీడపీడల్ని నివారించే ప్రయత్నం చేయమని ఆ సంస్థ రైతులకు సూచించింది. ఈ ప్రాజెక్టుకు ఆర్థిక సహాయాన్ని హైదరాబాద్‌లోని "సెంటర్ ఫర్ వరల్డ్ సొలిడారిటి", "సెంటర్ ఫర్ సస్టైనబుల్ అగ్రికల్చర్" సంస్థలు అందించాయి. వీటికి తోడు పునుకుల గ్రామంలో మహిళలకు తోడ్పడుతున్న ఐదు సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్ ఉత్సాహంతో క్రియాశీలక పాత్రను పోషించిన ఫలితంగానే పర్యావరణ పరిరక్షణ పద్ధతుల్లో చీడపీడల్ని నివారించడం సాధ్యమైనదన్నది వాస్తవం.

**చౌకగా చీడపీడల్ని వదిలించుకునే పద్ధతి :** ఆ స్వచ్ఛంద సంస్థ ముందుగా 20 మంది రైతుల్ని ఎంపిక చేసింది. వీరిలో స్త్రీలు కూడా ఉన్నారు. పురుగుమందుల వ్యాపారులకు ఏజెంటుగా పనిచేసిన రైతులు కూడా స్వచ్ఛంద సంస్థ చేపట్టిన ప్రాజెక్టుల పాల్గొనడం విశేషం. ఈ ప్రాజెక్ట్ విజయాన్ని తొలుత ఆ గ్రామ మహిళలు లిఖించిన మాట వాస్తవం. చీడపీడలు ఎలా పుట్టి పెరుగుతాయన్న అంశాన్ని అర్ధం చేసుకుంటే వాటి ధాటిని ఎదుర్కొనడం సులభమవుతుందని రైతులు గ్రహించారు. రసాయనాలు కలుసున్న పురుగు మందుల్ని పంటలపైన చల్లడం మాని ప్రాథమికంగా చౌకగా లభించే వేప విత్తనాలపొడి, పచ్చిమిర్చి, వెల్లుల్లి ముద్దలు వంటి వాటితో తయారుచేసిన ద్రవాన్ని వినియోగించడం ప్రారంభించారు. ఫెర్మోన్ ట్రాప్స్‌ను వాడి రెక్కల పురుగులను ఆకర్షించి, అవి జట్టు కట్టకముందే నిర్మూలించేవారు. కొందరు రైతులు క్రాప్ ట్రాప్‌లను వాడారు. అంటే పత్తితోపాటు వారు పురుగుల్ని ఆకర్షించే బంతి, ఆముదం పంటల్ని సాగుచేసేవారు.

**అద్భుత ఫలితాలు :** ఇలాచేయడం ప్రారంభించిన తర్వాత కేవలం ఒక్క సీజన్‌లోనే మంచి ఫలితాలు రావడం మొదలైంది. రసాయన పురుగుమందులు చల్లడం ఆపడంతో, పత్తిపై ఆశించే పురుగుల్ని తినే మిత్రపురుగులు, స్పైడర్లు, వాస్ప్‌లు, బీటిల్స్ పొలాలకు రావడం పెరిగింది. దాంతో మరుసటి సీజన్‌లో ఈ ప్రాజెక్ట్‌లో పాల్గొనేందుకు మరికొంతమంది రైతులు ఉత్సాహంతో ముందుకు వచ్చారు. చీడపీడల్ని నాశనం చేసేందుకు బజారుకు పోయి రసాయన పురుగుమందుల్ని కొని వాడటం సులభం. అందుకోసం వేపపిండి, పచ్చిమిర్చి, వెల్లుల్లి ముద్దల్ని కలపడం వంటి పనులకోసం ఎందుకు శ్రమ పడటం అని ఆలోచించే రైతులు కూడా పునుకులలో లేకపోలేదు.

**స్త్రీల పట్టుదల :** ఐతే, సెల్ఫ్ హెల్ప్ గ్రూపులను నిర్వహిస్తున్న పునుకుల మహిళలు మాత్రం అలా ఆలోచించే మగవారిని పురుగుమందుల దుకాణాలవైపు వెళ్ళకుండా చేయగలిగారు. నూతన పద్ధతుల్లో చీడపీడలను వదిలించుకోవడం వల్ల ఖర్చు తగ్గుతుందని, ఎకరాకు ఒక్కోసారి దాదాపు పదివేల రూపాయల వరకు మిగుల్చుకోవచ్చునని మాకు తెలుసు. అలాంటప్పుడు ఎందుకు మళ్ళీరసాయన పురుగుమందుల జోలికి వెళ్లడం అని ప్రశ్నిస్తున్న స్త్రీల వాదన ముందు మందుల దుకాణాలకు వెళ్ళాలనుకునే రైతులు తలవంచక తప్పలేదు.

**విజ్ఞత :** రసాయన పురుగుమందుల వాడకం వలన అప్పుల బాధ పెరగడం అనారోగ్యాన్ని కొనితెచ్చుకొని చికిత్స కోసం భారీగా ఖర్చు చేయడం తప్పదని గ్రామంలోని ఇతరులు కూడా గ్రహించారు. రైతులను శ్రమ పెట్టకుండా వారి కుటుంబసభ్యులే చీడపీడలను నివారించే ద్రవాన్ని (వేప, మిరప, వెల్లుల్లి ముద్దలనుండి) తయారు చేయడం ప్రారంభించారు. గ్రామంలోకి ఎవరైనా సరే రసాయన పురుగుమందులు తీసుకువస్తే సహించేది లేదని మహిళలు అందరు ముక్తకంఠంతో నినదించారు.

**తగ్గిన క్రిమిసంహారక మందుల అమ్మకాలు :** ఆ గ్రామంలో 200 ఇళ్ళు ఉన్నాయి. 2003 నాటికి ఆ కుటుంబాల్లోని రైతులు అందరూ దాదాపుగా హానికరమైన రసాయన పురుగుమందుల వాడకాన్ని నిలిపివేశారు. అమ్మకాలు నాటకీయంగా పడిపోవడంతో పురుగుమందుల డీలర్లు ఆ గ్రామానికి రావడం మానేశారు. 400 ఎకరాల పత్తిలోనే కాకుండా పచ్చిమిరప, వరిపైన కూడా పునుకుల గ్రామ రైతులు చీడపీడల్ని కొత్త పద్ధతుల్లోనే నివారిస్తున్నారు. 2003 ఖరీఫ్ సీజన్‌లో ఈ గ్రామంలోని 600 ఎకరాల భూమిలో సాగైన పంటలపై రసాయన పురుగుమందుల్ని చల్లనేలేదు. ఈ ఖరీఫ్‌లో కూడా పునుకుల రైతులు ఇదే పద్ధతిని పాటించారు.

**యంత్రాల కొనుగోలు :** 2004 ఆగష్టులో ఆ గ్రామంలో సెల్ఫ్ హెల్ప్ గ్రూపులు నిర్వహిస్తున్న మహిళలు స్వచ్ఛంద సంస్థలు అందించిన ఆర్థిక సహాయంతో వేపగింజల్ని పిండిచేసే యంత్రాన్ని కొనుగోలు చేశారు. ఆ పిండి నుంచే చీడపీడల నివారణకు వాడే ద్రవాన్ని తయారు చేస్తారు.

**ప్రచారం :** పునుకుల గ్రామంలో పండే పంటలు ఎంతో నాణ్యంగా ఉంటాయన్న పేరు చుట్టుప్రక్క పల్లెలకు పాకింది. పొరుగునున్న వున్న గ్రామాలకు పునుకుల ఆదర్శ గ్రామంగా మారింది. ఈ పల్లెకు కేవలం 15 కి.మీ. దూరంలో జూలూరుపాడు అనే గ్రామం ఉంది. అక్కడ రైతులు అధిక మోతాదులో రసాయన పురుగు మందుల్ని వాడుతున్నా చీడపీడల ఉధృతి తగ్గడం లేదు.

**పెరిగిన ఆదాయం :** రసాయన పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి డబ్బు మిగిల్చిన పునుకుల రైతులు ఇప్పుడు ఆ సొమ్ముతో గృహాలకు మరమ్మత్తులు చేయిస్తున్నారు. భూమిని, పశువుల్ని కొంటున్నారు. ఆదాయం పెరగడంతో చాలామంది రైతులు పాత రుణాలను తీర్చేస్తున్నారు. **పురుగుమందుల వాడకాన్ని ఆపేస్తే పురుగుల్ని వదిలించకోవచ్చునని ఇప్పుడు పునుకుల గ్రామ రైతులు బలంగా విశ్వసిస్తున్నారు.**

ప్రచురణ: డైరెక్టరు - ఆర్.డి.టి. ఎకాలజీ సెంటర్, ఉప్పరపల్లి రోడ్డు, బెంగుళూరు హైవే, అనంతపురం - 515 002.

☎ (08554) - 244222 / 246884, ఫ్యాక్స్ : (08554) - 244990